ప్రజాశక్తి
గురువారం 2 నవంబర్ 2023

4న జాబ్ మేళా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించేందుకు మూడు ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో 205 ఉద్యోగాలను భర్తీకి ఈనెల 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ ఒక ప్రకటన లో తెలిపారు. ఈనెల 4న ఉదయం 10 గంటల నుండి బిసి కాలనీ లో నున్న ప్రభుత్వ ఐటిఐ కళాశాల వద్ద జాబ్ మేళా జరుగుతుందని, ఈ మేళా కు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఉద్యోగాలు నవత ట్రాన్స్పోర్ట్, పేటిఎం, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థల లో ఉన్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు www.ncs.gov.in website job seeker login లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. బయో డేటాతో రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో ప్రభుత్వ ఐటిఐ వద్ద హాజరు కావాలని తెలిపారు.

విన్నపాలు వింటూ.. భరోసా కల్పిస్తూ..

200 కిలోమీటర్లు సాగిన ప్రజా రక్షణ భేరి

అడుగడుగునా సమస్యలపై అర్జీలు

వైసిపి, టిడిపి మోసం చేస్తున్నాయంటూ ఆవేదన

ప్రభుత్వంపై ఒత్తిడిచేసి సాధిద్దామన్న భేరి బృందం

వృద్ధురాలితో మాట్లాడి సమస్య తెలుసుకుంటున్న వి.శ్రీనివాసరావు

పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో 200 కిలోమీటర్ల మేర ప్రజారక్షణ భేరి సాగింది. యాత్రలో అడుగడుగునా ప్రజా, రైతు, కార్మిక, గిరిజన, ఉద్యోగుల సమస్యలపై విన్నపాలు అందాయి. నాడు టిడిపి, నేడు వైసిపి ప్రభుత్వాలు మోసం చేశాయంటూ భావోద్వేగంతో సిపిఎం నాయకుల ఎదుట మొరపెట్టుకున్నారు. చాలా మంది వినతిపత్రాలు అందజేయగా, ప్రసంగాలు విన్నాక, 'ఔను! మోసపోయాం' అంటూ తమ అనుభవాలు చెప్పకొచ్చారు. సమస్యల చిట్టాలు అందుకున్న నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడిచేసి సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాడుతామని హామీ ఇచ్చారు. ఎర్రజెండా ఎప్పటికీ పేదలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, ప్రజల పక్షానే పనిచేస్తుందని అభయమిచ్చారు.

గజపతినగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, శ్రేణులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, గంట్యాడ, గజపతినగరం, శృంగవరపుకోట

ప్రజా రక్షణ భేరి బస్సుయాత్ర మూడో రోజు బుధవారం ఉదయం 10 గంటలకు గజపతినగరంలో ప్రారంభమైంది. గజపతినగరంలో పురిటిపెంట రోడ్డు నుంచి పోలీస్ స్టేషన్ వరకు, తిరిగి గణేష్ కోవెల మీదుగా చంపావతి బ్రిడ్జి వరకు ప్రదర్శన సాగింది. అనంతరం బొండపల్లి మీదుగా గంట్యాడ మండల బుడతనాపల్లికి చేరింది. అక్కడ మధ్యాహ్న భోజన విరామం అనంతరం తామరాపల్లి మీదుగా శృంగవరపుకోట మండలం బొడ్డవర జంక్షన్ వరకు సాగింది. అనంతరం రాత్రికి అల్లూరి సీతారామ రాజు జిల్లా అనంతగిరి చేరింది. అన్నిచోట్లా మహిళలు.. సిపిఎం నాయకులకు హారతి పట్టి, తిలకం దిద్దారు. జనం డప్పుల చప్పుడుతో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. పోడు పట్టాలు ఇప్పించాలని, తమ గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని బొడ్డవర జంక్షన్‌లో గిరిజనులు వినతులు అందజేశారు. జిందాల్ బాక్సైట్ శుద్ధి ఫ్యాక్టరీ పేరిట భూములు లాగేసుకుని 18 ఏళ్ళు గడుస్తున్నా ఏర్పాటు చేయలేదని, ఉద్యోగాలు ఇస్తామంటూ మోసం చేశారని బాధిత గిరిజనులు వినతి అందజేశారు. గజపతినగరంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి భవనాలు ఏర్పాటు చేయాలని, గంట్యాడలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ బిసి హాస్టల్ భవనాలను పునర్నిర్మించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతి దీవెనల నిధులు విడుదల చేయాలని వినతులిచ్చారు. తాము గొర్రెలు మేపుతూ జీవనోపాధి పొందుతున్న కొండను కృషి విజ్ఞాన కేంద్రం పేరిట లాగేసుకుని పొట్ట కొట్టేందుకు పాలకులు ప్రయత్నం చేస్తున్నారంటూ దత్తిరాజేరు మండలం చినచామలాపల్లికి చెందినవారు వినతి అందజేశారు. అంగన్‌వాడీలు, భవన నిర్మాణ కార్మికులు, డప్పు కళాకారులు, రైతులు, ఉపాధి కూలీలు తమ సమస్యలపై వినతులందించారు. వీటిపై నాయకులు స్పందిస్తూ ప్రభుత్వంపై పోరాడి న్యాయం చేస్తామన్నారు. భేరి యాత్రలో భాగంగా శృంగవరపుకోట మండలం బొడ్డవర వద్ద 2006లో జిందాల్ బాక్సైట్ శుద్ధి కర్మాగారం కోసం కేటాయించిన భూములను, బుడతనాపల్లిలో ఎండిపోయిన వరి పొలాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ పరిశీలించారు.

బుడతనాపల్లిలో వరిచేను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పిఎన్ఎం కళాకారుల నృత్య ప్రదర్శన

- గజపతినగరం, బుడతనాపల్లి, తామరాపల్లి, బొడ్డవర జంక్షన్లలో జరిగిన సభల్లో నాయకులు మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షాభావం వల్ల జిల్లాలో వరిపంట ఎండిపోయిందని, ఇప్పటికే పంటనాశనమైన నేపథ్యంలో కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. లేదంటే రైతులను సమీకరించి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడతామని హెచ్చరించారు. పదేళ్లగా పెండింగ్‌లో ఉన్న పెదమానాపురం రైల్వే ఫ్లైఓవర్ పూర్తి చేయలేదన్నారు. తోటపల్లి గజపతినగరం బ్రాంచ్ కెనాల్ పూర్తి చేసి 15 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పిన సిఎం జగన్మోహన్ రెడ్డికి మాట నిలబెట్టుకోవడం చేతకాలేదన్నారు. వైసిపి ప్రభుత్వం భూపంపిణీ పేరిట పేదల వద్ద ఉన్న అసైన్డ్ భూములను ఆక్రమణదారులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. మెంటాడ, పాచిపెంట మండలాల్లో దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలిచ్చేదుకు మీనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు.



నాయకులకు వినతి అందిస్తున్న విద్యార్థులు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలో ఇప్పటికీ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అదానీ, అంబానీల ప్రయోజనాల కోసం కేంద్రం విద్యుత్ సంస్కరణలు తీసుకొస్తే, రాష్ట్రంలోని జగన్మోహన్‌రెడ్డి సర్కారు వాటిని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. అందువల్లే విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని, సామాన్యులపై పెనుభారం పడుతోందని విరుచుకుపడ్డారు.

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర నాయకులు హైమావతి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన చెందారు. స్కీమ్‌వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ, పనికి తగ్గ వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. • సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్ మాట్లాడుతూ వైసిపి, టిడిపితోపాటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజనులకు తీరని ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. గిరిజన చట్టాల్లో మార్పుచేసి అభివృద్ధి పేరిట కొండలు, అడవుల నుంచి గిరిజనులను దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. • ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలన్నీ మన రాష్ట్రంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నారని, దీనివల్ల అన్ని తరగతుల ప్రజానీకంపై భారాలు పడుతున్నాయని, వ్యవస్థలు నిర్వీర్యమౌతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపుచేస్తానని గద్దెనెక్కిన ప్రధాని మోడీ నష్టదాయకమైన వ్యవసాయ చట్టాలు తీసుకొస్తే వైసిపి, టిడిపి ఎమ్‌పిలంతా వంతపాడారని వివరించారు.

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, టిడిపి, జనసేన నాటకీయ రాజకీయాలు ప్రజలకు వివరించి, ఆయా పార్టీల నుంచి రక్షించేందుకే సిపిఎం ఆధ్వర్యాన ప్రజారక్షణ భేరి.. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్నామన్నారు. ఈ నెల 15న విజయవాడలో జరిగే బహిరంగ సభకు తరలి రావాలని, ప్రజా సమస్యలపై అక్కడ చర్చించి, భవిష్యత్తు పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

కిల్లో సురేంద్ర

తమ్మినేని సూర్యనారాయణ

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు, గాడి అప్పారావు, పి.రామ్మోహన్, జగన్ మోహన్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, కౌలురైతుల సంఘం జిల్లా నాయకులు రాకోటి రాములు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిఎంఆర్ సంస్థల చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు

ఎయిర్‌పోర్టు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి మరో అడుగు ముందుకు పడింది. ప్రజాశక్తిలో నవంబర్ 1న విమానాశ్రయం నిర్మాణానికి భూమి పూజని ముందుగానే కథనం వచ్చిన మాదిరిగానే బుధవారం ఎల్ అండ్ టి సంస్థ భూమి పూజ చేసింది. దీనికి ముఖ్య అతిథిగా జిఎంఆర్ సంస్థల చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు హాజరయ్యారు. ఎల్ అండ్ టి సంస్థ నుంచి కూడా ముఖ్య అధికారులు పాల్గొన్నారు. కౌలువాడ రెవెన్యూ పరిధిలోని మరడపాలెం సమీపంలో ఈ భూమి పూజ నిర్వహించారు. భూమి పూజ అనంతరం విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన భూముల్లో చదును చేసే పనులు ప్రారంభమవుతాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన యంత్రాలు కూడా ఎల్ అండ్ టి సంస్థ సిద్ధం చేసింది. ఈ విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి జిఎంఆర్ సంస్థకు ప్రభుత్వం సేకరించిన 2700 ఎకరాల్లో 2500 ఎకరాలను అప్పజెప్పింది. జిఎంఆర్ సంస్థ విమానాశ్రయం నిర్మాణ పనులను ఎల్ అండ్ టి సంస్థకు అప్పజెప్పింది. ఈ భూమి పూజలో రెండు సంస్థలకు చెందిన ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆ రెండు సంస్థలకు చెందిన ప్రతినిధులతో పాటు సిబ్బంది పాల్గొనేలా చర్యలు తీసుకుని ఇతర ప్రజా ప్రతినిధులెవరనీ పిలవకుండా భూమి పూజ చేసుకున్నారు.

కోలుకునే వరకూ ఆసుపత్రిలో చికిత్స

క్షతగాత్రులకు పరిహారం చెక్కులు అందించిన మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం కోట, గరివిడి

రైలు ప్రమాద బాధితులకు సహాయాన్ని గురువారంలోగా బాధిత కుటుంబాలకు అందజేస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. రైలు ప్రమాద దుర్ఘటనలో గాయపడి స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహార చెక్కులను మంత్రి బొత్స బుధవారం అందజేశారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రకటించిన మేరకు రైలు ప్రమాద దుర్ఘటనలో మృతి చెందిన 13 మంది కుటుంబాలకు రూ.1.30 కోట్లు, గాయపడిన 30 మందికి రూ.1.29 కోట్లు, శాశ్వత అంగవైకల్యానికి గురైన ముగ్గురికి రూ.30 లక్షలు అందజేశామన్నారు. నెలపైగా ఆసుపత్రిలో చికిత్స అవసరమైన వారికి రూ.5 లక్షల పరిహారం చొప్పున 15 మందికి రూ.75 లక్షలు ఇచ్చామన్నారు. నెల రోజుల్లోపల ఆసుపత్రిలో చికిత్స పూర్తిచేసుకొని డిశ్చార్జి అయ్యే వారికి రూ.2 లక్షలు చొప్పున 12 మందికి రూ.24 లక్షలు సహాయం అందించామన్నారు. గరివిడి మండలంలో మృతి చెందిన నలుగురి కుటుంబ సభ్యులకు ఆ మండల కేంద్రంలో పరిహారం అందించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిసిహెచ్ఎస్ బి.గౌరీశంకర్, డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

సచివాలయ వ్యవస్థతో ధైర్యం, స్థైర్యం

గుర్ల : సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా సామాన్యులకు ధైర్యం, స్థైర్యం కల్పించామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గుజ్జంగివలసలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న టేక్ హోమ్ రేషన్లో ఒక లీటరు పాల పేకెట్లు బదులు అర లీటరు పేకెట్లు ఇవ్వాలని కలెక్టర్ కు సూచించారు. అనంతరం జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో సుమారు 70 శాతం సచివాలయాలను పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ బి.శాంతకుమారి, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, ఎంపిపి పొట్నూరు ప్రమీల, డిఎల్‌డిఒ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు, తహశీల్దార్ వి.పద్మావతి, ఎంపిడిఒ బి.కల్యాణి పాల్గొన్నారు.

క్లయిములు, అభ్యంతరాల ఫారాలను వారంలో పరిష్కరిస్తాం

జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి-విజయనగరం

ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా చేర్పులు, మార్పులకు, తొలగింపులకు అభ్యంతరాలకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 7వ తేదీ లోగా పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూత్ స్థాయి లో జరిగే స్పెషల్ కాంపెయిన్ కార్యక్రమాలకు పొలిటికల్ ప్రతినిధులు కూడా హాజరై, అర్హులందరినీ ఓటర్లు గా చేర్పించడంలో సహకరించాలని కోరారు. కాలేజ్‌లలో కూడా క్యాంపెన్ నిర్వహించి 18 ఏళ్ల నిండిన వారందరిని ఓటర్లు గా చేర్పిస్తామన్నారు. ఇవిఎంల ఫస్ట్ లెవెల్ చెక్ ఇంతవరకు 70 శాతం పూర్తయిందని, మరో రెండు రోజుల్లో మొత్తం పూర్తవుతుందని, తర్వాత 2 రోజులు మాక్ పోలింగ్ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ అనిత, ఆర్‌డిఒలు సూర్యకళ, సాయి శ్రీ, ఎస్‌డిసిలు వెంకటేశ్వరరావు, దొర, నూకరాజు, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భక్తుల తాకిడి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి దర్శనానికి బుధవారం కూడా భక్తులు తాకిడి కొనసాగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూ కట్టారు. సిరిమాను సంబరం మంగళవారంతో ముగియడంతో దర్శనం కానీ భక్తులు, ఇతర ప్రాంతాలు నుంచి వచ్చిన వారు బుధవారం దర్శించుకున్నారు. మరోవైపు ఆలయం బయట సిరిమాను చెక్క కోసం భక్తులు ఎగబడ్డారు. సిరిమాను చెక్క ఇంటిలో ఉంచితే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.

ఆలయం వద్ద క్యూలో ఉన్న యాత్రికులు

నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని చిన్న చామలాపల్లి రెవెన్యూ పరిధిలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయవద్దంటూ ఆ గ్రామ గొర్రెల, మేకల పెంపకం దారులంతా గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు రాకోటి రాములు ప్రారంభించనున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రతిపాదన వెనక్కి తీసుకుంటున్నామని ప్రభుత్వం ప్రకటించే వరకూ దీక్షలు కొనసాగుతాయని గొర్రెల మేకల పెంపకందారులంతా చెబుతున్నారు.

జూనియర్ డాక్టర్‌పై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా సర్వజన ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్ పై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు గురాన అయ్యలు డిమాండ్ చేశారు. ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లకు సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ శిక్షణలో ఉన్న హౌస్ సర్జన్ డాక్టర్ పి. సువర్ణ రాజు సోమవారం రాత్రి ఆసుపత్రిలో రోగులకు చికిత్స చేస్తున్న సమయంలో ఓ రోగికి సంబంధించిన సహాయకుడు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అధికార పార్టీ అండదండల తోనే ఆకతాయిలు రెచ్చిపోతున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు హుసేన్ ఖాన్, రవితేజ, అడబాల వేంకటేష్ , పథ్వీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

52 రోజులైనా నేరం రుజువు చేయలేకపోయారు

టిడిపి నేత అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట

చంద్రబాబును అరెస్టు చేసి 52రోజులు జైల్లో ఉంచినా నేరాన్ని రుజువు చేయలేకపోయారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం ఉత్సవాల ముగింపు రోజున చంద్రబాబు విడుదల కావడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిని శాసనసభకు వెళ్లకుండా చూశారని అన్నారు. చంద్రబాబు విడుదల కోసం శాంతియువత నిరసనలు తెలిపి, ఆలయాల్లో పూజలు చేసిన అభిమానులకు, కార్యకర్తలకు,ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

ఏ రాష్ట్రంలో రైలు ప్రమాదం జరిగినా రైల్వే మంత్రి వెళ్తారని, కానీ మన జిల్లాలో జరిగిన ప్రమాదాన్ని పరిశీలించేందుకు రాకపోవడానికి కారణాలు ఏమిటని అశోక్ ప్రశ్నించారు. ప్రమాద ఘటనను పరిశీలించకపోవడం, బాధితులను పరామర్శించక పోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఏమైనా మేనేజ్ చేశారా అని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. సమావేశంలో టిడిపి నాయకులు ఐవిపి రాజు, ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, బొద్దల నర్సింగరావు, రాజేష్‌బాబు, గంటా పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్వీట్లు పంపిణీ చేస్తున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు

ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం

చంద్రబాబు నాయుడు జైలు నుంచి బయటికి రావడంతోప్రజల ఆకాంక్ష నెరవేరిందని మాజీ ఎమ్మెల్యే మీసాల గీత అన్నారు. బుధవారం స్థానిక కోట వద్ద చంద్రబాబు నాయుడు 52 రోజుల తర్వాత జైలు నుంచి బెయిల్‌పై బయటకు రావడంతో ఆమె ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి, చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజం గెలవాలని నారా భువనేశ్వరి చేపట్టిన యాత్ర ఫలించిందని అన్నారు ముఖ్యమంత్రి ఎన్ని కుట్రలు నిర్బంధాలు పెట్టినా నిజం ఎప్పటికైనా గెలుస్తుందని తెలుసుకోవాలని అన్నారు. నారా లోకేష్ యువగాలంతో చేపట్టిన పాదయాత్రకు వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేకపోయిందని అన్నారు. రేపటి భవిష్యత్తు కావాలంటే రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రజలు గ్రహించారన్నారు. కార్యక్రమంలో విజయనగరం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పునరంకితం కావాలి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగం, కృషితో ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాడనికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరెట్ ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి, తెలుగు తల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. త్యాగధనుల స్ఫూర్తితో అధికారులు ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. జెసి మయూర్ అశోక్ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారి కోసం తెలుగు రాష్ట్రం ఏర్పాటు చేయాలని కృషి చేసిన పొట్టి శ్రీరాములు చిర స్మరనీయులని కొనియాడారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్‌డి అనిత పాల్గొన్నారు.

వాసవీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన..

వాసవీ ఆర్యవైశ్య వెల్ఫేయిర్ అసోసియేషన్ భవనం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ ,జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, కార్యదర్శి సముద్రాల నాగరాజు, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, చెన్నా బుచ్చి జనార్ధనరావు,రాంజీ, ప్రకాష్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

స్వచ్ఛందంగా గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కొప్పరవలస, కొత్తవలస గ్రామాల మధ్య రోడ్డు గుంతలుగా తయారై ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో మేము సైతం ప్రజల కోసం అంటూ మండలంలోని బంగారు వలస గ్రామానికి చెందిన కెంగువ శ్యాంసుందర్ తన సొంత ఖర్చుతో రోడ్డుపై ఏర్పడిన గుంతలను కంకర మట్టితో పూడ్చారు. దీంతో ఆయన్ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తుమ్మల యోగేంద్ర, నారాయణరావు, పెంట నాయుడు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి-బొబ్బిలి

విశాఖ ఉక్కు పోరాటం ఈ నెల 8వ తేదీతో వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో అదే రోజు రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు విద్యార్థి, యువజన సంఘాలు తెలిపాయి. బొబ్బిలి పట్టణంలో గంటి ప్రసాదం స్మారక భవనంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలో చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎ.సురేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మణికుమార్, ఎఐటియుసి నాయకులు ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - వంగర

వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 27న ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాలవలస యామిని, గొట్టపు గుణశ్రీ, శివాపు దీప్తి రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణమ్మ తెలిపారు. ఒక్కో విద్యార్థినికి రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.36వేలు క్యాష్ అవార్డు ఫౌండేషన్ అందజేసినట్టు తెలిపారు. ఈ పోటీలకు పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు ఎస్. జయకృష్ణ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ధర్మవరం ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయనగరం ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ధర్మవరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించింది. తొమ్మిదో తరగతి విద్యార్థులు దేగల పృథ్వీరాజు, ఎస్.భానుప్రకాష్ ప్రదర్శించిన 'స్మార్ట్ ట్రాలీ ఫర్ డిజేబుల్ పర్సన్స్', 'స్మార్ట్ ఫ్లాగ్ హోస్టింగ్' అనే ప్రాజెక్టు అందరినీ ఆకట్టుకుని, ప్రథమ స్థానానికి ఎంపికైంది. వీరిని హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు, గైడ్ టీచర్ పొట్నూరు శివాజీ, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ తమ్మినాన రాజేష్ అభినందించారు.

స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాల ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలను ఆక్రమించేసి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

సూర్యనారాయణను పరామర్శిస్తున్న బేబినాయన, నాయకులు

బాధితుడికి బేబినాయన పరామర్శ

ప్రజాశక్తి-బొబ్బిలి

బలిజిపేట మండలం పణుకువలస ఎంపిటిసి మాజీ సభ్యులు మర్రాపు సూర్యనారాయణ రైలు ప్రమాదంలో గాయపడి, విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. బుధవారం ఆయనను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యేలు తెంటు రాజా, బొబ్బిలి చిరంజీవులు పరామర్శించారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఇఒ పి.బాల భాస్కరరావు బుధవారం సందర్శించారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లతోపాటు వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పారావు, సిఆర్‌పిలు కె.రాంప్రసాద్, డి.కోటేశ్వరరావు, వి.సునంద, వై.లక్ష్మి, ఉపాధ్యాయులు ఆర్.రామసత్యం, ఆర్.అప్పలసత్యం పాల్గొన్నారు.

చెత్త బుట్టలు పంపిణీ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని ఆకులసీతంపేట గ్రామంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా చెత్త బుట్టలను వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ జగన్నాథం నాయుడు, అంగన్వాడీ టీచర్ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

కుర్చీలను ప్రారంభిస్తున్న జడ్జి వాణి

కుర్చీలు వితరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట బార్ అసోసియేషన్ పూర్వ సభ్యులు సింగంపల్లి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రవీణ్ రూ.10 వేలు విలువైన కుర్చీలను బార్ అసోసియేషన్‌కు అందజేశారు. బుధవారం వాటిని న్యాయమూర్తి సబ్బవరపు వాణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపిపి పప్పు కేశవరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి అల్లు సత్యాజీ, డబ్ల్యుఎన్ శర్మ, సీనియర్ న్యాయవాదులు జి.సూరిదేముడు, ఎం.దుర్గాప్రసాద్, గేదెల ప్రకాష్, ఎన్‌టివి దాసు, బి.త్రిమూర్తులు, టివిఆర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు మండలాల్లో విద్యుత్తు నిలిపివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాల్లో గురువారం గురువారం ఉదయం 6 గంటలనుండి సాయంత్రం 6 గంటలవరకు 220 కె వి సబ్ స్టేషన్ లో మెయింటెనెన్సు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీలైనంత వరకూ కొన్ని గ్రామాలకైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి చూస్తున్నామని, ఆయా ప్రాంతాలు ప్రజలు సహకరించాలని కోరారు.

విధులకు డుమ్మా

- ఇష్టానుసారంగా గైర్హాజరవుతున్న సచివాలయ ఉద్యోగులు
- యూనిఫాం ధరించడానికి విముఖత
- ఉద్యోగుల తీరుపై ప్రజల్లో అసంతృప్తి
- పట్టించుకోని మండల స్థాయి అధికారులు

ప్రజాశక్తి - వంగర

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ప్రారంభించింది. అయితే అందులో పని చేస్తున్న ఉద్యోగులు మాత్రం సకాలంలో విధులకు హాజరు కాకపోవడం, విధులకు డుమ్మా కొడుతుండటంతో ప్రభుత్వ లక్ష్యం పక్కదారి పడుతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు తప్ప మిగతా సేవలు సచివాలయాల ద్వారా ప్రజలకు సక్రమంగా అందకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది ఉద్యోగులు ఇష్టానుసారంగా విధులకు హాజరుకాకపోవడంతో పాటు కొంత మంది యూనిఫామ్ ధరించడానికి కూడా విముఖత చూపిస్తున్నట్లు తెలిసొంది.

మండలంలో 19 సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సచివాలయాల్లో పనిచేసి ఆయా సచివాలయాల పరిధిలో గల గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల సేవలను అందించవలసి ఉంది. సచివాలయ వ్యవస్థ ప్రారంభంలో ఉద్యోగులంతా సకాలంలో హాజరైనప్పటికీ పర్మినెంట్ అయిన తరువాత ఉద్యోగులంతా సమయపాలన పాటించకుండా విధులకు డుమ్మా కొడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో ప్రధానంగా మడ్డువలస, భాగేంపేట, తలగాం, రాజుల గుమ్మడ, వివిఆర్ పేట, కింజంగి, అరసాడ, సంగాం, ఎం సీతారాంపురం తదితర సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వారికి నచ్చిన సమయంలో సచివాలయానికి వచ్చి హాజరు వేసుకుని వెళ్లిపోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఈ మేరకు ప్రజాశక్తి గత వారం రోజుల నుంచి మండలంలోని మడ్డువలస, భాగేంపేట, శ్రీహరిపురం, ఎం సీతారాంపురం తదితర సచివాలయాలను ఉదయం 10.30 గంటల నుండి పరిశీలించగా ఒక్కో సచివాలయంలో సుమారు పదిమంది ఉండవలసి ఉన్నప్పటికీ ఇద్దరు ముగ్గురు తప్ప మిగతా ఉద్యోగులు కనిపించడం లేదు. మిగతా ఉద్యోగులు ఎందుకు రాలేదని హాజరైన ఉద్యోగులని విలేకరులు అడిగితే పొంతన లేని సమాధానాలు చెప్పారు. పలు సచివాలయాల్లో మూమెంట్ రిజిస్టర్ కూడా సక్రమంగా నిర్వహించడం లేదు. దీంతో మిగతా ఉద్యోగులు ఎక్కడకైనా వెళ్లారా? ఉద్యోగానికి రాలేదా? అన్న విషయంలో స్పష్టత లేదు. విధులు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అధికార పార్టీకి చెందిన నాయకులే గుసగుసలాడుకుంటున్నారు.

మడ్డువలస సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

వెంటాడుతున్న సిబ్బంది కొరత

మండలంలోని శ్రీహరిపురం, మద్దిలవలస తదితర సచివాలయాల్లో పనిచేసిన ఉద్యోగులు బదిలీపై వెళ్లిపోయారు. వారి స్థానంలో మరెవరినీ ప్రభుత్వం నియమించలేదు. దీంతో ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు సకాలంలో సేవలు అందక మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన కరువు

ప్రజలు దూర ప్రాంతాలు వద్ద ఉన్న నెట్ సెంటర్ల వద్దకు వెళ్లి ఎక్కువ డబ్బులు ఖర్చు చేసి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు సచివాలయాల్లో అన్ని సేవలూ ప్రభుత్వం అందిస్తుంది. కానీ ఈ విషయాలను సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. దీంతో ఎక్కువమంది దూర ప్రాంతానికి వెళ్లి నెట్ సెంటర్‌ను ఆశ్రయించి ఎక్కువ డబ్బులు ఖర్చు చేసి ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని ప్రైవేటు నెట్ సెంటర్లు దోచుకుంటున్నాయి.

తూతూ మంత్రంగా తనిఖీలు

సచివాలయాలను మండల స్థాయి అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారు. దీంతో ఉద్యోగులు సక్రంగా విధులకు హాజరు కావడం లేదని ఆరోపణలున్నాయి. కొన్ని సచివాలయాల్లో ఉద్యోగులు మండల స్థాయి అధికారుల మాటను కూడా బేఖాతరు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు మండలంలో పర్యటించి సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఆరా తీసి తగు చర్యలు తీసుకుంటే తప్ప ప్రజలకు సకాలంలో సేవలు అందవని పలువురు చర్చించుకుంటున్నారు.

యూనిఫాం ధరించడం అరుదు

సచివాలయ వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి అందులో పని చేస్తున్న ఉద్యోగులందరికీ ప్రభుత్వం యూనిఫారం సరఫరా చేసింది. ప్రతి రోజూ యూనిఫామ్ వేసుకోవాలని నిబంధన పెట్టింది. కానీ ఆ నిబంధనలను సచివాలయం ఉద్యోగులు పాటించడం లేదు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్నప్పుడు జిల్లాస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు వంగర మండలం వచ్చి తనిఖీలు చేసి ఉద్యోగులంతా యూనిఫామ్ ధరించాలని సమయపాలన పాటించాలని సూచనలు చేశారు. ప్రస్తుతం వంగర విజయనగరం జిల్లాలోకి మారిన తరువాత అధికారులు సరిగా పట్టించుకోకపోవడంతో యూనిఫామ్ ధరించకపోతే ఎవరు ఏమంటారులే అన్న ధీమాతో డ్యూటీ సమయాలలో ఎవరు ఇష్టానుసారంగా వారు సివిల్ దుస్తుల్లోనే ఉంటున్నారు.

సివిల్ దుస్తుల్లోనే ఉన్న భాగేంపేట సచివాలయ ఉద్యోగులు

శ్రీహరిపురంలో సిబ్బంది లేక వేసిన తాళం

సమయపాలన పాటించకపోతే చర్యలు

సచివాలయ ఉద్యోగులంతా సమయపాలన పాటించాలి. అదే విధంగా యూనిఫామ్ తప్పని సరిగా ధరించాలి. నిబంధనలను పాటించకపోతే జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపడతాం.

- హెచ్ శశిభూషణరావు, ఎంపిడిఒ వంగర

3న ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర

నెల్లిమర్ల.. మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 3న కోట వద్ద నిర్వహించనున్న సిపిఎం ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర రావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎపి బెవరేజస్ వద్ద ప్రజారక్షణ యాత్రపై కార్మికులతో సమావేశం నిర్వహించి గోడ పత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారక్షణ బస్సు యాత్రను ఈ నెల 2న మందసలో సిపిఎం అఖిల భారత నాయకులు ప్రారంభిస్తారని అక్కడి నుంచి విజయనగరం వస్తుందని చెప్పారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతల్లేని అభివృద్ధి కోసం సిపిఎం అధ్వర్యంలో మూడు బస్సు యాత్రలు ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తూ నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాయన్నారు. దీనికి ముందు ఈ నెల 3న విజయనగరం కోటవద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నామని దీనికి నగరం నలుమూలల నుంచి అత్యధిక ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమణ, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజా రక్షణ భేరి

బొబ్బిలి : దేశంలో లౌకికవాదాన్ని కాపాడి ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజా రక్షణ భేరి నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాలం తెలిపారు. ఈ నెల 15న జరిగే చలో విజయవాడను జయప్రదం చేయాలని బుధవారం సిఐటియు కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.నాగభూషణ్ పాల్గొన్నారు.

చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చినప్పలనాయుడు

మత్స్య సంపదతో ఆర్థికాభివృద్ధి

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మత్స్య సంపద పెంపకం ద్వారానే మత్స్యకారులంతా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. బుధవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో పక్కి కోనేటిచెరువులో చేపపిల్లలను విడిచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లోని చెరువుల్లో చేపపిల్లలు విడుదల చేయుటకు గాను 4,29,796 ఫింగర్లింగ్ సైజు చేప పిల్లలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మత్స్య సంపద పెంచడం ద్వారా జీవనోపాధి లభిస్తుందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ఇదివరకే వలలు, వాహనాలు, శీతలీకరణ పెట్టెలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, సర్పంచ్ పైడిరాజు, మత్స్యశాఖ ఎఇ సంతోష్, బొబ్బిలి మత్స్యశాఖ అధ్యక్షులు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నేత చౌదరి నారాయణమూర్తి

బైక్ ర్యాలీగా వెళ్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు

నియోజకవర్గ పరిశీలకులు చౌదరి నారాయణమూర్తి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఆ పార్టీ శృంగవరపుకోట నియోజకవర్గ పరిశీలకులు చౌదరి నారాయణమూర్తి అన్నారు. చంద్రబాబు బెయిల్‌పై విడుదలైన సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో సత్యమేవ జయతే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు లాంటి విజనున్న వ్యక్తినే జగన్ అరెస్టు చేయించి, పైశాచిక ఆనందాన్ని పొందారని విమర్శించారు. ప్రజలు వైసిపిని తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఎవరూ పార్టీకి అతీతం కాదన్నారు. నియోజకవర్గంలో తనకు తెలియకుండా పార్టీ కార్యక్రమాలు చేపట్టకూడదని, ఎవరు పిలిచినా వచ్చి పార్టీకి పనిచేస్తానని తెలిపారు. త్వరలోనే కోళ్ల లలితకుమారి, గొంప కృష్ణపై కార్యకర్తలు, ప్రజలు, బూత్ కన్వీనర్ల అభిప్రాయాలు తీసుకుని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ మాట్లాడుతూ. ఏ తప్పూ చేయని చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపించారన్నారు. చంద్రబాబు అరెస్టును ప్రపంచంలో 119 దేశాల్లో ప్రజలు రోడ్లమీదకి వచ్చి వ్యతిరేకించారని గుర్తుచేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేనలదే గెలుపని ధీమా వ్యక్తంచేశారు.

వేపాడ : సత్యమేవ జయతే కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి ఆధ్వర్యంలో మండలం నుంచి టిడిపి, జనసేన నాయకులు ర్యాలీగా బయల్దేరి వెళ్లారు.

ఓటర్ల జాబితా తయారీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఓటర్ల జాబితా తయారీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణపై సూచనలు చేశారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 4, 5, డిసెంబరు 2, 3 తేదీలను ప్రత్యేక ప్రచార రోజులుగా ప్రకటించారు. ఆ రోజుల్లో బిఎల్‌ఒలు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఎస్ డిటి ఆర్.సాయికృష్ణ, ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

గ్రామంలో కాలువలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రామారావు

ఎ.టి.అగ్రహారాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎ.టి.అగ్రహారం గ్రామాన్ని ఎంపిడిఒ జి.రామారావు బుధవారం సందర్శించారు. ప్రజాశక్తి పత్రికలో ఎటి అగ్రహారంలో డయేరియా అనే కథనానికి స్పందించిన ఆయన తన సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. డయేరియా రావడానికి గల కారణాలను ఆరా తీశారు. శానిటేషన్ చేసిన ప్రాంతాలు, పాఠశాల ప్రాంగణం పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు, స్థానిక వాలంటీర్‌లకు, అధికారులకు, గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మెరుగైన శానిటేషన్, క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపిటిసి, గ్రామ పెద్దలు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పలు క్రీడలకు ఎంపిక పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

67వ స్కూల్ గేమ్స్ లో భాగంగా ఈనెల 2 తేదీ నుంచి 10 తేదీ వరకు వివిధ క్రీడా అంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 2న టెన్నిస్ అండర్14,17 బాల బాలికల జిల్లా సెలక్షన్స్ విజయనగరం రాజీవ్ క్రీడా ప్రాంగణంలోను, 3న హ్యాండ్ బాల్ అండర్-14, బాల బాలికల జిల్లా ఎంపిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలోను, అదే రోజున సెపక్ తక్రా అండర్-14,17 జిల్లా స్థాయి సెలక్షన్ విటి అగ్రహారం జెడ్‌పి హైస్కూల్‌లో జరుగుతాయని తెలిపారు. 4న నెట్ బాల్ అండర్-14, 17 బాల బాలికల ఎంపికలు గడసాం జెడ్‌పి హైస్కూలు, 6న దత్తిరాజేరులో ఖోఖో ఎంపిక పోటీలు జరుగుతాయని తెలిపారు. 7న కబడ్డీ పోటీలు అలుగోలులోను, 10న అథ్లెటిక్స్ పోటీలు రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరుగుతాయని తెలిపారు.

3న సాఫ్ట్‌బాల్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు

ఈనెల 3న అండర్ 19 విభాగంలో స్విమ్మింగ్, సాఫ్ట్‌బాల్, టేబుల్ టెన్నిస్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి పివిఎల్ఎన్ కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం రాజీవ్ క్రీడా ప్రాంగణం, ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో జరగనున్న ఎంపిక పోటీలకు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికేట్ పట్టుకొని హాజరు కావాలని తెలిపారు.

నేడు గూడెపువలసలో గడపగడపకు..

భోగాపురం : మండలంలోని గూడెపువలస సచివాలయం పరిధిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి బుధవారం తెలిపారు. శుక్రవారం ఇదే సచివాలయం పరిధిలోని దల్లిపేట గ్రామంలోనూ నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు సర్పంచులు, ఎంపిటిసిలు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురంలో రూ.10లక్షలతో నిర్మించిన సిమెంట్ రహదారిని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం ప్రారంభిస్తారని వైస్ ఎంపిపి పడాల సత్యవతి బుధవారం తెలిపారు. మండల పరిషత్ నిధులతో బొల్లి వీధిలోని పాఠశాల నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ఈ రోడ్డు నిర్మాణం జరిగిందని ఆమె తెలిపారు.

పోలీసుల అదుపులో మరో యువకుడు

ప్రజాశక్తి - భోగాపురం

హత్య కేసుకు సంబంధించి మరో యువకుడిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. తోటపల్లి మద్యం షాప్ వద్ద జరిగిన కొట్లాట కేసులో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చినరాము అనే యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కొట్లాటలో రాజుకి కూడా గాయాలయ్యాయి. గాయాలు తగ్గుముఖం పట్టడంతో రాజును అదుపులోకి తీసుకున్నామని గురువారం రిమాండ్‌కు తరలిస్తామని ఎస్. ఐ కృష్ణమూర్తి తెలిపారు.